జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 2-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 690 పేజీలు: 4 వెల : రూ.7

## 12 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే..

# విశాఖ రైల్వే జోన్



* నా జీవితంలో ఎప్పటికీ మరువలేని మహత్తర ఘట్టం * విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన * శ్రీకాకుళం జిల్లాలో రూ.3,300 కోట్లతో 50కి పైగా ఆర్ఓబీల మంజూరు * ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి జిల్లా ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు * కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పెద్దపీట * కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు * ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ఘనంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభోత్సవం * ఏ.ఎస్.పేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డు ఆవిష్కరణ

**ఇచ్ఛాపురర, జూన్1 (వార్త):** 12 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ఎట్టకేలకు ఫలితం వచ్చిందని, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించిన రైల్వే జోన్ ప్రారంభోత్సవ అధికారిక కార్యక్రమంలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు భావోద్వేగంతో మాట్లాడుతూ, విశాఖ రైల్వే జోన్ సాధన కోసం గత 12 సంవత్సరాలుగా తాను సాగించిన సుదీర్ఘ పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్లమెంట్‌లో ఈ అంశంపై అనేకసార్లు గళమెత్తానని, ఇదే ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో ప్రజాప్రతినిధిగా దీక్షలు కూడా చేపట్టానని పేర్కొన్నారు. "అనాడు ఒక సామాన్య ప్రజాప్రతినిధిగా ప్రజల పక్షాన నిలబడి పోరాడాను.. ఈరోజు కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తరుణంలోనే ఆ కల సాకారం కావడం, నా చేతుల మీదుగానే ఈ జోన్ ప్రారంభం కావడం నా జీవితంలో ఎప్పటికీ మరువలేని మహత్తర ఘట్టం" అని హర్షం వ్యక్తం చేశారు. సోమవారం నుండి విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక పరిపాలన ప్రారంభమైందని కేంద్ర మంత్రి వెల్లడించారు. నూతన జోన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే సమస్యలకు స్థానికంగానే త్వరితగతిన పరిష్కారాలు లభిస్తాయని, పరిపాలన మరింత సులభతరం అవుతుందని చెప్పారు. గతంలో స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు కూడా ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడమే లక్ష్యంగా విశేష కృషి చేశారని, వారి ఆశయాలను ఈరోజు నెరవేర్చగలిగామని సగర్వంగా ప్రకటించారు. దాదాపు పుష్కర కాలంగా ఈ పవిత్ర ఆకాంక్షను భుజాలపై మోస్తూ, చివరకు అనుకున్నది సాధించామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రూ.3,300 కోట్ల భారీ వ్యయంతో 50కి పైగా రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరయ్యాయని వివరించారు. ఇందులో ఇచ్ఛాపురం ప్రాంతానికి కూడా ఒక కీలకమైన ఆర్ఓబీ మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురం పట్టణ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న వంతెన సమస్యకు ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోనే పూర్తిస్థాయి ముగింపు పలుకుతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. పట్టణ ప్రగతికి, ప్రజల రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా శాశ్వత పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే, నూతనంగా సాధించిన పూరి--అహ్మదాబాద్ రైలు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తులో ఈ రైలు సేవలు నేరుగా ఇచ్ఛాపురం నుంచే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటానని తన ఆకాంక్షను వెల్లడించారు. రూ.400 కోట్లతో ప్రధాన కార్యాలయ నిర్మాణం: విశాఖపట్నంలో 54 ఎకరాల విశాలమైన విస్తీర్ణంలో, సుమారు రూ.400 కోట్ల అంచనా వ్యయంతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులు ఇప్పటికే శరవేగంగా ప్రారంభమయ్యాయన్నారు. ఈ చారిత్రాత్మక పండుగ తరుణంలో తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన రైల్వే జోన్‌ను మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇందుకు నిరంతరం సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి జిల్లా ప్రజల తరఫున కేంద్ర మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. ఇచ్ఛాపురం సరిహద్దు ప్రాంతమైన ఏ.ఎస్.పేట సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డును ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడే మొక్కలు నాటారు. అనంతరం ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 22వ వార్డులో లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులతో మంత్రి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బహిరంగ సభలో మాట్లాడి అనంతరం రైలులో ఇచ్ఛాపురం నుంచి పలాస బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జెడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస్ రౌలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య, కూటమి నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.




### ఉత్తరాంధ్రలో నూతన శకం

**పలాస:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారిక కార్యకలాపాలు సోమవారం నుండి పూర్తిస్థాయిలో ప్రారంభం కావడం ఉత్తరాంధ్ర రవాణా, ఆర్థిక రంగాల అభివృద్ధిలో ఒక చారిత్రాత్మక మైలురాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. నూతన రైల్వే జోన్ ప్రారంభోత్సవ పండుగ వాతావరణంలో భాగంగా ఇచ్ఛాపురం నుంచి రైలులో సోమవారం పలాస చేరుకున్న కేంద్ర మంత్రికి స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆధ్వర్యంలో కూటమి నాయకులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా పలాసలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వే జోన్ కార్యకలాపాలు సాకారం కావడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంత రైల్వే సమస్యల పరిష్కారం కోసం, కొత్త రైళ్ల మంజూరు కోసం భువనేశ్వర్ లేదా సికింద్రాబాద్ వైపు చూడాల్సి వచ్చేదని, ఇకపై ఆ అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల రైల్వే పరిపాలన నిర్ణయాలు జరుగుతాయని స్పష్టం చేశారు. పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునే నిజమైన ప్రజా ప్రభుత్వమని కొనియాడారు. ఉత్తరాంధ్ర ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కావడం వెనుక కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు నిరంతర కృషి, పోరాటం ఉన్నాయని ప్రశంసించారు. గత పాలకులు రైల్వే జోన్ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పనులను వేగవంతం చేసి కార్యకలాపాలను ప్రారంభ దశకు తీసుకువచ్చిందని శిరీష పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏ పి టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పలాస టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్టర్ కుమార్తె ప్రభుత్వ బడిలో చేరిక

**కంచిలి, జూన్ 1(వార్త):** కంచిలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ నర్తు కృష్ణంరాజు కుమార్తె నర్తు జెస్సికారాజ్ కంచిలి మండలం పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతిలో చేరింది. ఇంతకుముందు ఒక ప్రైవేటు పాఠశాలలో రెండవ తరగతి వరకు చదివిన జెస్సికారాజ్‌ను డాక్టర్ కృష్ణరాజు ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలకు, బోధనా పద్ధతులకు ఆకర్షితులై ప్రభుత్వ బడిలో చేర్పించారు. ఈ అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సప్పటి శివరాం ప్రసాద్ , పురుషోత్తపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సింహభట్ల శారద, ఉపాధ్యాయులు నల్లాన రవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శమళ్ల వెంకటరావు మాస్టారు, వజ్జ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



### మహిళ భూమిపై..

## కబ్జాదారుల కన్ను!

* కంచె వేయనీయకుండా దౌర్జన్యం * అసభ్య దూషణలు, బెదిరింపులు * పోలీసులకు ఫోన్ చేసిన మహిళ

**సంతబొమ్మాళి/పలాస, జూన్ 1 (వార్త):** సంతబొమ్మాళి మండలం భావనపాడు గ్రామంలో ఓ మహిళకు చెందిన జిరాయతీ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. భూమికి కంచె వేయించుకుంటున్న మహిళను అడ్డుకుని అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. బాధితురాలు అందించిన వివరాలిలా ఉన్నాయి. పలాస ఐటీఐ నగర్‌కు చెందిన కుందు రాజేశ్వరి తెలిపిన వివరాల మేరకు



బావనపాడు గ్రామ పరిధిలో సర్వే నెం.63-23ఏలో ఉన్న 21 సెంట్ల జిరాయతీ భూమి డాక్యుమెంట్ నెం.1791/2024 ద్వారా చట్టబద్ధంగా తన పేరిట రిజిస్ట్రేషన్ అయింది. అప్పటి నుంచి ఆ భూమి ఆమె హక్కు, అనుభవంలో ఉంది. అయితే గ్రామానికి చెందిన బండి యర్రమ్మ, బండి రాజులు, అడ్ల దానేశ్, అడ్ల శారద, అడ్ల దానమ్మ, అడ్ల దానేసు, అడ్ల గోపాల్, బండి యర్రయ్య, మోస గిరమ్మ తదితరులు తన భూమిని అక్రమంగా ఆక్రమించుకునే ఉద్దేశంతో మట్టి పోసి అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తన భూమికి సిమెంట్ ఫిల్లర్లు, జి.ఐ. వైర్‌తో కంచె వేయించుకుంటుండగా పై వ్యక్తులు గుంపుగా అక్కడికి చేరుకున్నారని తెలిపారు. "నీకు భూమి లేదు.. దిక్కున్నోడికి చెప్పుకో" అంటూ దుర్భాషలాడడమే కాకుండా తాను పాతించిన ఫిల్లర్లను తొలగించారని ఆరోపించారు. మహిళను లక్ష్యంగా చేసుకుని అసభ్య పదజాలంతో దూషిస్తూ భయభ్రాంతులకు గురిచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆమె డయల్ 112కు ఫిర్యాదు చేసింది. నౌపడ పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం పూర్తి వివరాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆమెకు సూచించారు. తన భూమిని కాపాడడంతో పాటు తనను దూషించి బెదిరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు నౌపడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై నౌపడ ఎస్సై స్వామిని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

* రూ.80 లక్షల విలువ గల చోరీ సొత్తు స్వాధీనం * పోలీసుల చాకచక్యంతో వరుస దొంగతనాల కేసుల పరిష్కారం * ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం/పలాస, జూన్1 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాల కేసులను కాశీబుగ్గ పోలీసులు సమర్థవంతంగా ఛేదించి ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి వెల్లడించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అరెస్టు కాబడిన నిందితులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని మాల్దా జిల్లా, ఇంగ్లీష్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన గోయస్పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మీజాన్, మహమ్మద్ హసన్ అని తెలిపారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ మీజాన్ పగటి సమయంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి (రెక్కీ నిర్వహించి), రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడేవాడని చెప్పారు. దొంగిలించిన బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను విక్రయించేవాడని విచారణలో వెల్లడైందన్నారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ మీజాన్‌పై గతంలో శ్రీకాకుళం జిల్లాలో 7 కేసులు, విజయనగరం జిల్లాలో 7 కేసులు, విశాఖపట్నం జిల్లాలో 2 కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో కొన్ని కేసులలో కోర్టు శిక్ష విధించగా, జైలు శిక్ష కూడా అనుభవించాడన్నారు. 2025 అక్టోబర్ నెలలో జైలు నుండి విడుదలైన తర్వాత జిల్లాలో పోలీసుల నిఘా పటిష్టంగా ఉండటంతో ఒడిశా రాష్ట్రంలోని బరంపురంలో నివాసం ఉంటూ మళ్లీ నేర కార్యకలాపాలకు పాల్పడడం ప్రారంభించాడన్నారు. గత మూడు నుంచి నాలుగు నెలల కాలంలో ప్రధాన నిందితుడు మహమ్మద్ మీజాన్, మహమ్మద్ హసన్‌తో కలిసి కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు దొంగతనాలు, టెక్కలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనానికి పాల్పడ్డారనాష్ట్రురు. మన్యం జిల్లా పార్వతీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, ఒడిశా రాష్ట్రం బరంపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో కూడా వీరి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించడం జరిగిందన్నారు. పలాస మండలం గరుడఖండి గ్రామం జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఒక ఇంటిలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి కాశీబుగ్గ, టెక్కలి, పార్వతీపురం మరియు బరంపురం ప్రాంతాల్లో జరిగిన కేసులకు సంబంధించిన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల వద్ద నుండి 12 తులాల బంగారు ఆభరణాలు, 20 కిలోల వెండి ఆభరణాలు, రూ.1,09,350 నగదు, సుమారు రూ.1 లక్ష విలువైన మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న మొత్తం చోరీ సొత్తు విలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ కేసుల ఛేదనలో కాశీబుగ్గ పోలీస్ సిబ్బంది అత్యంత చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనబరిచారు. అదనపు ఎస్పీ (క్రైమ్)పి. శ్రీనివాసరావు, కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని పర్యవేక్షణలో కాశీబుగ్గ సిఐ



వై. రామకృష్ణ, కాశీబుగ్గ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సునీల్, కాశీబుగ్గ హెడ్ కానిస్టేబుల్ టీ. భాస్కరరావు, కానిస్టేబుళ్లు , ఎస్. ఉషాకిరణ్, ఎం. నీలకంఠం, ఎస్. రాధాకృష్ణ,ఎల్. ఉమామహేశ్వరరావు, పీసీ అలీ, అధికారులు, సిబ్బంది ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించినందుకు ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు.

**LOSS OF PASSPORT**

I, TOTA TIRUPATHIRAO S/o TOTA MUKUNDARAO, resident of D.No.1-67, Kondiveedhi, Bendi Village & Post, Vajrapukotturu Mandal, Pin-532220 Srikakulam District, Andhra Pradesh State do hereby declare that my original Passport No.R7873325 has been lost while I was travelled from Bendi village to Vajrapukotturu on 04.02.2026 by auto. In spite of my best efforts I am unable to trace it and it is lost beyond recovery. If it is traced please contact me. Ph.No.9100527367.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## పేదల సేవగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**మందస, జూన్ 1(వార్త):** పేదలకు అందుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదలకు మేలు జరుగుతోందని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని బాలిగాం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస మండలం బాలిగాం పంచాయతీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందనే దానికి ఈ పింఛన్ల పంపిణీయే నిదర్శనమన్నారు. బావన దుర్యోధన ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొర్లాం పీహెచ్‌సీలో మలేరియా మాసోత్సవాలు




**సోంపేట, జూన్ 1(వార్త):** కొర్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నుంచి నెలాఖరు వరకు యాంటీ మలేరియా మాసోత్సవాలను వైద్యాధికారిణి డాక్టర్ నీలాపు రోషిని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కొర్లాంలో పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యాధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. మలేరియా జ్వరం నివారణ కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉచితంగా పరీక్షలుచేపట్టి మందులు అందజేయబడతాయని అన్నారు. ప్రజలు దీనిపై ఆందోళన చెందాలసిన అవసరం లేనప్పటికి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ పి హర్షిత రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పిఎస్ మణిమాల, హెల్త్ ఎడ్యుకేటర్ బి.వసంతకుమారి, హెల్త్ అసిస్టెంట్ డి.జయవర్మ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వడదెబ్బ బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి




**సోంపేట, జూన్ 1(వార్త):** బుషాభద్ర గ్రామంలో ఇటీవల వడదెబ్బకు మృతి చెందిన పల్లి మహాలక్ష్మి కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎంజె ఫూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీరావు పేర్కొన్నారు. సోమవారం ఉదయం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ మహాలక్ష్మి కూతురు వివాహమై అత్తవారింట్లో ఉందని భర్త కుమారుడు మానసికంగా ఎటువంటి పనులు చేసుకోలేని పరిస్థితుల్లో బలహీనంగా ఉన్నారని అన్నారు. ఈ కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో సోంపేట తహసిల్దారు, బారువా సబ్ ఇన్స్పెక్టర్, కొర్లం వైద్యాధికారి తమ సమయాన్ని వెచ్చించి పూర్తిస్థాయి నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారని తెలిపారు. ప్రస్తుతం ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఢిల్లీరావు పేర్కొన్నారు. హరిచంద్ర తదితరులు ఉన్నారు.

## పింఛన్ల పంపిణీ



**మందస, జూన్ 1(వార్త):** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పెంచి, ప్రతీ నెల ఒకటో తేదీన పంపిణీ చేస్తోందని మందస మండలంలోని సొండిపూడి పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మిస్క గణపతి, తెలుగుదేశం పార్టీ మందస మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు అన్నారు. సొండిపూడిలో వారు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస నియోజకవర్గం శాసనసభ్యురాలు గౌతు శిరీషా ఆదేశాలతో సొండిపూడిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో పాటు కొత్తగా పింఛన్లు మంజూరు చేయనుందన్నారు. అర్హులకు తప్పక కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ సొండిపూడి అధ్యక్షుడు మిస్క గణపతి, తెలుగుదేశం పార్టీ మందస మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగాన ఈశ్వరరావు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, కూటమి పెద్దలు పాల్గొన్నారు.

## భైరిపురం అభివృద్ధికి కృషి చేస్తాం



**కంచిలి, జూన్ 1(వార్త):** భైరిపురం గ్రామాభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు అన్నారు. గ్రామంలో 80 మీటర్ల సిమెంట్ రహదారికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రజలకు సౌకర్యాలు పెంపొందించి వారి జీవనోపాదులు పెంచడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పూర్ణ శ్రీను హరి చంద్రయ్య ధర్మ దుర్యోధన భగవాన్ తదితరులు ఉన్నారు.

## నూతలపాటికి పరామర్శ

**కంచిలి, జూన్ 1(వార్త):** ఇచ్ఛాపురం ఏఎంసీ మాజీ చైర్మన్ వైసీపీ సీనియర్ నేత, జర్నలిస్ట్ నూతలపాటి బాబురావు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. కుడి చేయికి బలమైన గాయం కావడంతో ప్రస్తుతం ఆయన కంచిలిలో గల తన ఇంటి వద్ద విశ్రాంతిలో ఉన్నారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం వైసిపి సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, పార్టీ సీనియర్ నేతలు నర్తు నరేంద్ర యాదవ్, తడక జోగారావు, చల్ల దేవరాజు సోమవారం సాయంత్రం బాబురావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.



# విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ ఆపాలి

**- పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి**

**- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి**




**మందస, జూన్ 1(వార్త):** వైద్య, విద్య రంగాల ప్రైవేటీకరణ ఆపాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో గల క్రాంతి సీపీఐ జిల్లా కార్యాలయంలో జులై 1నుంచి 4వ తేదీ వరకు కర్నూలు నగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చేటువంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్రమంతా ఏదో పెద్ద చేశామన్న ఆనందంలో సంబరాలు చేసుకుంటున్నారన్నారు. మాకు కావాల్సింది సంబరాలు కాదని, విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సందర్భంలో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చే నేటికి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న ఇంతవరకు జీవో నెంబర్ 77 రద్దు చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు సిద్ధలా వ్యవస్థలోకి చేరాయని, విద్యార్థులు చదువుకుంటున్న సందర్భంలో పైన గోడలకు ఉన్నటువంటి పెచ్చులు ఊడి విద్యార్థుల తలలపై పడుతున్న పరిస్థితి ఈ జిల్లాలో చాలా పాఠశాలల్లో కనబడుతోందన్నారు. మరమ్మతుల కోసం నిధులు విడుదల చేసి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయకుండా కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్ర చట్టాన్ని పట్టణ ప్రాంతాలలో గ్రామీణ ప్రాంతాలలో ఎంత వసూలు చేయాలని ఒక చట్టాన్ని తీసుకువచ్చినప్పటికీ, ఈ రాష్ట్రంలో ఏ ఒక్క ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమానులు దాన్ని పాటించకపోవడం లేదని మండిపడ్డారు. వైద్య, విద్యను ప్రైవేటీకరణ ఆపాలని, రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది పేద, మధ్య, తరగతి తల్లితండ్రులు పిల్లలు మంచి కోచింగ్ పంపిస్తే నీట్ లో ర్యాంకు వస్తే డాక్టర్లు అవుతారన్న ఆనందం ఉంటే దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన నీట్ ప్రవేశ పరీక్ష లీకైతే.. విద్యాశాఖ మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థుల బాధలు కష్టాలు మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు. జులై 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శిక్షణ తరగతులలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి విద్యా వ్యతిరేక విధానాల పైన చర్చించి రాష్ట్రవ్యాప్తంగా సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు దాసరి సోమశేఖర్, కౌశిక్, హర్ష, అశోక్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




# అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మేథోశక్తి

**-ప్రభుత్వం కల్పిస్తున్న పలు పథకాల వర్తింపు**

**-జూన్ 20వరకు అంగన్ వాడీ పిలుస్తోంది**

**-ఐసీడీఎస్ మందస సీడీపీఓ పెద్దింటి అరుణ**

**మందస, జూన్ 1(వార్త):** అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మేథోశక్తి పెరుగుతుందని, అంతేకాకుండా ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలు వర్తిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ పెద్దింటి అరుణ అన్నారు. మందస పట్టణంలోని ఐసీడీఎస్ కార్యక్రమంలో సోమవారం జరిగిన సమావేశంలో అరుణ మాట్లాడుతూ జూన్ 1నుంచి 20వరకు అంగన్ వాడీ పిలుస్తోంది అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వశీ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చిన్న పిల్లల కోసం చేపట్టిన ఒక ప్రత్యేక కార్యక్రమం-పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అంగన్ వాడీ ద్వారా పిల్లల శారీరక, మానసిక, మేధాశక్తి అభివృద్ధి గురించి అవగాహన దీని ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.


మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చడం, వారికి నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే లక్ష్యమన్నారు. పూర్వ ప్రాథమిక విద్య: ఆటపాటలతో అక్షరాలు, పాటలు నేర్పించడం మరియు శారీరక, మానసిక వికాసానికి తోడ్పడటం. పౌష్టికాహారం: చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం. ఆరోగ్య పరీక్షలు: టీకాలు వేయించడం, క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయడం. ఈ అంశాలు అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, కనుక అంగన్ వాడీ కేంద్రాలలో చిన్నారులను చేర్పించే విధంగా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు సీహెచ్.వి.రామలక్ష్మి, జె.లక్ష్మి, ధనలక్ష్మి, రాజేశ్వరి అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## జేఈఈ అడ్వాన్స్‌లో నరసన్నపేట విద్యార్థుల ప్రతిభ

**- పవన్ సాయి, అల్లు రోహిత్ జాతీయ స్థాయిలో ర్యాంకులు**

**- విద్యార్థుల విజయంపై తల్లిదండ్రుల ఆనందం**



**నరసన్నపేట, జూన్ 1(వార్త):** జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో నరసన్నపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నారు. అత్యున్నత ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటడంతో పాటు నరసన్నపేటకు మంచి గుర్తింపు తీసుకొచ్చారు. నరసన్నపేటకు చెందిన తండ్యాల పవన్ సాయి జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 702వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 118వ ర్యాంకు సాధించి మెరిశాడు. పవన్ సాయి తండ్రి జనార్ధనరావు పోలాకి మండలం దీర్ఘాసిలో ఉపాధ్యాయుడిగా, తల్లి పద్మావతి రాళ్లపాడులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమారుడు సాధించిన విజయంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే నరసన్నపేటకు చెందిన అల్లు రోహిత్ కూడా జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో సత్తా చాటాడు. గత నెల 17న నిర్వహించిన పరీక్షల్లో పాల్గొన్న రోహిత్ ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో 102వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 14వ ర్యాంకు సాధించి విశేష ప్రతిభ కనబర్చాడు. సోమవారం విడుదలైన ఫలితాల నేపథ్యంలో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రోహిత్ ఇటీవల నిర్వహించిన ఐఐటీ జేఈఈ పరీక్షల్లో కూడా జాతీయ స్థాయిలో 444వ ర్యాంకు సాధించినట్లు తల్లిదండ్రులు అల్లు షణ్ముఖరావు, లలితాంబ తెలిపారు. క్రమశిక్షణతో కూడిన చదువు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ప్రోత్సాహమే విజయానికి కారణమని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల విజయంపై స్థానిక ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

# ప్రతిభకు పట్టం

**- విద్యార్థికి తేజేశ్వరరావుకు అభినందన**

**మెళియాపుట్టి, జూన్ 1(వార్త):** పదో తరగతి పరీక్ష ఫలితాలలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో చదువుకొని అత్యధిక మార్కులు సాధించిన యు. తేజస్విరావును మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం. ఎం. నాయక్ లు అభినందించారని చాపర వసతి గృహ నిర్వాహకులు నరసింహారావు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్ర ఆవరణలో మే నెలాఖరులో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాలో సంక్షేమ శాఖ వసతి గృహంలో చదువుకొని జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన మొదటి, రెండు మూడు స్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని వీరికి ప్రశంస పత్రాన్ని అందించారని ఆయన తెలిపారు. తమ కుమారుడు తేజేశ్వరరావు సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉండి అత్యధిక మార్కులు సాధించి గుర్తింపు తెచ్చుకొని ప్రశంస పత్రం అందుకోవడం పట్ల తల్లిదండ్రులు శ్రీనివాసరావు, ముద్దమ్మాలు, ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తేజేశ్వరరావు అత్యధిక మార్కులు సాధించడం పట్ల గ్రామస్తులు ఇంకా చదువులో రాణించి ఉన్నత శిఖరాల అధిరోహించాలని అభినందిస్తున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జేఈఈలో కంచిలి ప్రతిభ

**కంచిలి, జూన్ 1(వార్త):** కంచిలి విద్యార్థులు సోమవారం విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. కంచిలి లో నివాసం ఉంటున్న ఎమ్మెస్ పల్లి విద్యార్థి బత్తుల వంశీకృష్ణ 2616 ర్యాంక్ సాధించగా ఓబిసి కేటగిరీలో 504 వ ర్యాంకు రావడం విశేషం. ఉపాధ్యాయుడైన బత్తుల రమేష్ గాయత్రి దంపతుల కుమారుడు వంశీ ఇంటర్మీడియట్ వేలివెన్నులో శశి విద్యాసంస్థలలో చదువుకున్నాడు. సీబీఎస్ఈ సిలబస్ లో 500 గాను 469 మార్కులు సాధించి మంచి ప్రతిభ సాధించాడు. టాప్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వంశీ పేర్కొన్నాడు. కంచిలికి చెందిన గుడ్ల సాహితీ జాతీయస్థాయిలో 5451 ర్యాంకు సాధించగా ఈడబ్ల్యూఎస్ జనరల్ విభాగంలో 646 వ ర్యాంకుతో సత్తా చాటుకుంది. కంచిలికి చెందిన మరో విద్యార్థి ఇప్పిలి రాహుల్ ఈ డబ్ల్యు ఎస్ జనరల్ విభాగంలో 1307 వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. ఈ ముగ్గురు సాధించిన ప్రతిభతో కంచిలి మండలానికి మంచి గుర్తింపు లభించిందని స్థానికుల్లో హర్షం వ్యక్తం అవుతుంది. అడ్వాన్స్ లో మంచి ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులను అనేకమంది అభినందిస్తున్నారు.





# మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు

**- ఏఐ ఆధారిత ప్రాజెక్టుతో ఆకట్టుకున్న ఈదులవలస పాఠశాల బృందం**

**- ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు అవార్డులందించిన ఆర్జేడీ**



**పోలాకి, జూన్ 1(వార్త):** ఈదులవలస మోడల్ పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్, ఉపాధ్యా యులు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, అవార్డులు అందుకొని ప్రతిభ చాటుకున్నారు. విశాఖలోని గీతం యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వారి ఏఐ ఆధారిత ప్రాజెక్టు విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు సాంకేతికతను వినియోగిస్తూ రూపొందించిన ప్రాజెక్టును అధికారులు అభినందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ప్రిన్సిపల్ పైడి ప్రవీణకు "బెస్ట్ లీడర్ అవార్డు" లభించింది. టీజీటీ కృష్ణారావు, కంప్యూటర్ టీచర్ సౌజన్యలకు "బెస్ట్ ఫెసిలిటేటర్ అవార్డు"లను ఆర్జేడీ అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకత మరియు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆధునిక సాంకేతికతను బోధనలో భాగం చేయడం ద్వారా విద్యార్థులకు నూతన అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో కూడా విద్యా రంగంలో మరింత ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అర్హులందరికీ న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**- సకాలంలో పింఛన్లు అందుతున్నాయంటూ లబ్ధిదారుల హర్షం**



**పోలాకి, జూన్ 1(వార్త):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకి మండలం దీర్ఘాశి గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి నేరుగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ పడటం లేదన్నారు. పింఛన్లను ప్రతి నెల ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికే వెళ్లి గౌరవప్రదంగా అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసా కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ పేదల జీవనోపాధికి తోడ్పడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు వంటి బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, ప్రతి నెల సకాలంలో పింఛన్లు అందడం వల్ల తమకు ఎంతో ఊరట లభిస్తోందని తెలిపారు. ఇంటికే వచ్చి పింఛన్లు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పీఏసీఎస్ చైర్మన్ భైరి భాస్కరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ సూరపు నారాయణదాసు, మాజీ సర్పంచ్ పల్లి సూరిబాబు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చిట్టి సింహాచలం, తర్ర రాంబాబు, పల్లి మల్లేష్, మెండ రమణయ్య, పల్లి వెంకటరమణ, మెండ ఈశ్వరరావు, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

**-వైస్సార్సీపీ సమన్వయకర్త శ్యాం ప్రసాద్ రెడ్డి**



ఇచ్ఛాపురం, జూన్ 1(వార్త): జిల్లా పరిషత్ కార్యాలయం నందు జరిగిన గ్రీన్స్ సెల్ నందు ఇచ్చాపురం నియోజకవర్గం లోని పలు సమస్యలు పరిష్కారం కొరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ మరియు జాయింట్ కలెక్టర్ పర్మాన్ అహ్మద్ ఖాన్ మైన్స్ డి డి మోహన్ రావు ల దృష్టికి, హార్టికల్చర్ డి డి తదితర అధికారుల దృష్టిలోకి నియోజకవర్గ సమస్యలు తీసుకొని వెళ్ళటం జరిగిందని వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి చెప్పారు. పైడిగాం ఆనకట్ట, కాలువల మరమ్మత్తులు చేసి రానున్న ఖరీఫ్ లో రైతులకు సాగునీరు అందించగలరని, సోంపేట, కంచిలి మండలాలలోని పలు గ్రామాలలో ఏప్రియల్ నెలలో కురుసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న టమోటా పంట రైతులకు నష్ట పరిహారం మంజూరు చేయగలరని కోరడమైనదని చెప్పారు.

నియోజకవర్గం లోని మత్యకార గ్రామాలలో జరుగుతున్న ల్యాండ్ సర్వే పై ప్రజలలో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేయగలరని కోరడమైనదని. కంచిలి పట్టణం గుండా అర్ టిసి ఎక్ప్రెస్ బస్సులు ప్రయాణించే విదంగా చర్యలు తీసుకొనగలరని కోరడమైనదని, కంచిలి మండలం లోని దాకరపల్లి వాసులు స్మశాన వాటిక లేక ప్రస్తుతం నేషనల్ హైవే పక్కన దహన సంస్కారాలు జరుగుచున్నవి, ఆ గ్రామస్తుల విన్నపం మేరకు గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో స్మశాన వాటిక నిర్మాణం పనులు చేపట్టగలరని కోరడమైనదని, కవిటి మండలం సిలగం రెవెన్యూ పరిధిలోగల3 పంచాయతీలకు చెందిన పశువుల బీడు పోరంబోకు భూములు గతంలో హార్టికల్చర్ డిపార్ట్మెంట్ కు బదిలీ జరిగింది, ప్రస్తుతం హార్టికల్చర్ డిపార్ట్మెంట్ నుండి భూములు ఏ పి ఐ ఐ సి కు బదిలీ జరుగుకుండానే సర్వే నెంబర్ 110 లో 19.95 ఎకరాలలో ఎం ఎస్ ఎం ఈ పార్కు నిర్మాణం కొరకు శంకుస్థాపన పనులు జరగడం ప్రజలకు ఆందోళన కలిగిస్తుందని, సుమారు 2000 మంది కుటుంబాలకు చెందిన సామజిక భూమి నిబంధనలు పక్కన పెట్టి ఆగమేఘాల మీద ప్రభుత్వం నిర్మాణం తలపెట్టిన విధానం ప్రజలకు అనుమానాలు ఏర్పడినవి, ఒకవేళ ఆ ప్రాజెక్ట్ ప్రజల ప్రయోజనం కొరకు ఏర్పాటు చేయదలచితే ప్రతిపాధిత ప్రాజెక్ట్ పై ప్రజల ఆందోళనకు కారణాలు నివృత్తి చేయగలరని కోరడమైనదని చెప్పారు. కరాపాడు వద్ద నేషనల్ హైవే పై ఏర్పాటు చేసిన టోల్ గేట్ నిబంధనలు ప్రకారం రెండు టోల్ గేట్ ల మద్య 60కిలోమీటర్లు దూరం ఉండాలి గానీ(పలాస టోల్ గేట్ కు 35 -40 కిలోమీటర్లు దూరం ), నిబంధనలు పరిశీలించి కరాపాడు టోల్ గేట్ వేరే చోటుకు తరలించాలని కోరారు. బహుదా నది పై గల 11 గ్రోయిన్ లలో కాలువలు పూడిక తీయించి రానున్న ఖరీఫ్ సీజన్లో పంటలకు అనువుగా గల కాలువల ద్వారా సాగునీరు అందించే ప్రయత్నం చేయగలరని అదేవిదంగా పాడైన గ్రోయిన్ ల వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టే విదంగా చర్యలు తీసుకొనగలరని కోరారు.

కవిటి మండలంలోని సుమారు 12 డిపార్ట్మెంట్ లలో రెగ్యులర్ అధికారులు నియామకం జరుగక ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడం జాప్యం జరుగుతుందని, ఇంచార్జి అధికారులతో 12 శాఖలలో పూర్తి స్థాయి అధికారులు నియామకం జరిపించాలని కోరడమైనదని అన్నారు.

ఇచ్చాపురం పట్టణం నందు అర్ టీ సి బస్సులు ప్రస్తుత కాంప్లెక్స్ నుండి పాత బస్టాండ్ వరకూ వెళ్లి ప్రయాణికులను ఎంగేజ్ చేసే విదంగా చర్యలు తీసుకొనగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, తడక జోగారావు, చల్ల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# రావులవలస వద్ద ఆక్వాడెక్ట్ పనులు ప్రారంభం



**- రూ.39 లక్షలతో పునర్నిర్మాణం**

**- 6 వేల ఎకరాలకు సాగునీరు**

**నరసన్నపేట, జూన్ 1(వార్త):** రావులవలస వద్ద దెబ్బతిన్న ఆక్వాడెక్ట్ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం రూ.39 లక్షల నిధులను మంజూరు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆక్వాడెక్ట్ కూలిపోవడంతో పరిసర ప్రాంతాల్లోని సుమారు 6 వేల ఎకరాలకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పంటల సాగుపై ఆందోళన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే నిధులు మంజూరు చేసినట్లు ఈఈ మురళీమోహన్ తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మరో పది రోజుల్లో పనులను పూర్తి చేసే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆక్వాడెక్ట్ పునర్నిర్మాణం పూర్తయితే సాగునీటి సరఫరా పునరుద్ధరించబడడంతో రైతులకు ఊరట లభించనుందని చెప్పారు. వ్యవసాయానికి అవసరమైన నీటి వసతులు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆక్వాడెక్ట్ త్వరగా పూర్తవాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**-అర్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతోంది**

**- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా వ్యవస్థ**

**-ఎంఈఓ దాలినాయుడు**



**నరసన్నపేట, జూన్ 1(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన కొనసాగుతోందని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పేడాడ దాలినాయుడు తెలిపారు. సోమవారం నరసన్నపేట మండలం మాకివలస పంచాయతీలో ఉపాధి హామీ వేతనదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన జరుగుతోందని పేర్కొన్నారు. అర్హత సాధించిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం అధికంగా ఉన్నప్పటికీ బోధన అంతంత మాత్రంగానే ఉంటోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఒకటో తరగతి నుంచే ప్రత్యేక సిలబస్‌ను అమలు చేస్తూ విద్యార్థుల మేధో వికాసానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొస్తోందని, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకుని తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామస్థులు, ఉపాధి హామీ వేతనదారులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, జూన్ 1(వార్త):** అంతరిషింగి గ్రామానికి చెందిన నెయ్యిల. లక్ష్మి ప్రస్తుతం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ తరుణంలో లక్ష్మి ఇద్దరు కుమారులు రోడ్డు ప్రమాదంకి గురై అనారోగ్యం పాలయ్యారు .చిన్న కుమారుడు లక్ష్మీనారాయణ కు నోటినుంచి రక్త స్రవం అలాగే పెద్ద కుమారుడు పరిస్థితి కూడా విషమంగా మారడం తో వెంటనే శ్రీకాకుళం మెడికవర్ హాస్పిటల్ కి తరలించారు .అక్కడ వైద్యులు పరీక్షించగా పరిస్థితి అంతంత మాత్రమే అని చెప్పారు ఈవిషయం తెలుసుకున్న తెలుకుంచి లో ఉండే యువభారత్ సేవా ఫౌండేషన్ సంస్థ పెద్దమనస్సుతో ముందుకొచ్చి వాళ్ళఆరోగ్యం ఆ భగవంతుడు దయవల్ల వేగంగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థించి తమ వంతు సహాయకర్థం. 10 వేలు రూపాయలు అందించారు.

### మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ



**ఇచ్ఛాపురం, జూన్ 1(వార్త):** పాఠశాల మధ్యాన భోజన కార్మికులు కుక్ కుం హెల్పర్స్ కు ఒక్క రోజు శిక్షణ తరగతులు మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ లో నిర్వహించారు. మండల లో గల 70 స్కూల్ నుండి ప్రతి స్కూల్ నుండి ఒక్క వంట సహాయకులు కు ఈ రోజు శిక్షణ లో వంట శుచిగా మరియు రుచిగా ఎలా వంట చేయాలో తెలియజేస్తూ , వంట చేసిటప్పుడు తీసికోవాలిసిన జాగ్రత్తలు మరయు వంట ను పరిశుభ్రమైన వాతావరణం లో చేయాలి అని మొదలుగు విషయలు తెలియజేశారు. ఈ సమావేశంలో ఎంఈవోలు కె.సూర్యారావు, ఎస్.విశ్వనాథం, మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ట్రైనింగ్ ఇన్‌చార్జి పెద్దింటమ్మ, ఆఫీసు సిబ్బంది, సి.ఆర్.ఎంటి లు పాల్గొన్నారు.

## హరిపురంలో సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ

**మందస, జూన్ 1(వార్త):** మందస మండలంలోని హరిపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఎస్ఎస్సీ 1982-83బ్యాచ్ విద్యార్థిని విద్యార్థుల ఆర్థిక సహకారంతో సావిత్రిభాయి పూలే విగ్రహానిన పాఠశాలలో ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణకర్త ఉపాధ్యాయ ఎంఎల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు ముఖ్య అతిథితులగా మందస మండల విద్యాశాఖాధికారులు మర్రిపాటి లక్షణరావు, మర్రిపాటి భాస్కరరావు, హెచ్ఎం బొడ్డేపల్లి గోపిచంద్ హరిపురం, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్ కొంచాడ సురేష్, రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు దువ్వాడ దామోదరం, బైరిశెట్టి గున్నయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్ఎస్సీ 1982-83 విద్యార్థినీ, విద్యార్థులు అందరూ పాల్గొన్నారు. డాక్టర్ గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ సుమారు 60సంవత్సరాల వయస్సులో పూర్వ పాఠశాలను గుర్తించి, పూర్వ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి భాయి పూలే గుర్తించి ఈ కార్యక్రమము చేసిన ఎస్ఎస్సీ బ్యాచ్ వాళ్ళను ప్రశంసించారు. ఇ లాగే ప్రతీ బ్యాచ్ వాళ్ళు ఇటువంటి కార్యక్రమాలు చేసి నట్లయితే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయని, 1982-83 బ్యాచ్, జడ్పీహెచ్ఎస్ ప్లస్ కు విద్యార్థుల భోజనాలకు డైనింగ్ టేబుల్స్ నిమిత్తమై రూ.25వేలు విరాళంగా కూడా ఇవ్వడం అభినందనీయమని ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడుతో పాటు పీఆర్టీయు కార్యకర్తలు పీఆర్టియు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పప్పల రాజశేఖరరావు, పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నగిరి శరత్ బాబు, రమేష్ పాణిగ్రహి, సాంబమూర్తి, బొడ్డేపల్లి గోపీచంద్, మాధవరావు, తిరుమలేశ్వరరావు, గొర్లె చంద్రశేఖరరావు, జగన్నాయకులు, అప్పలనాయుడు, దీనబంధు, అందాల లోకేష్, ఉపేంద్ర బెహరా, రమణ బాబు, సాంబమూర్తి, మందస, సోంపేట పీఆర్టియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈదుపురంలో లైబ్రరీ ఏర్పాటు చేయండి



**ఇచ్ఛాపురం, జూన్ 1(వార్త):** ఈదుపురంలో లైబ్రరీ, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు హంగీర్ బేహేరా వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని విద్యార్థులు, యువత విద్యా అభివృద్ధి కోసం ఒక ప్రజా గ్రంథాలయం (లైబ్రరీ) ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ ప్రధాన రహదారిపై వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హంగీర్ బెహరా మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి, యువత విద్యా ప్రగతి కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హంగీర్ బెహరా, ఉదయ్ బెహరా, ఢిల్లీ, సాగర్ తదితర గ్రామ యువకులు పాల్గొన్నారు.

## గోనెపాడులో పింఛన్లు అందించిన కూన



**సరుబుజ్జిలి, జూన్ 1(వార్త):** గోనెపాడులో ఆమదాలవలస నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని, అర్హులందరికీ న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలి పారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు, విడో మహిళలకి అనేక వర్గాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అన్ని వేలలు అండగా ఉంటుందని, ఎవరు నిరాశ చెందవద్దని ఎమ్మెల్యే రవికుమార్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుండే వృద్ధులుకి 4000, వికలాంగులకు 6000, శాశ్వత వికలాంగులకు 15000 రూపాయలు ఇస్తున్నాం అని తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యనారాయణ,మండల అధ్యక్షులు అంబాల రాంబాబు, సర్పంచ్ బిర్లంగి నాగేషు, తెలుగు యువత అధ్యక్షులు ధవళ సింహాచలం, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇల్లాకుల ప్రభాకర్, యువ నాయకులు తాడేల రాజారావు, కొమనాపల్లి రవికుమార్, కిల్లి సిద్ధార్థ, తర్లాడ సురేంద్ర,స్థానిక కూటమి ముఖ్య నాయకులు, మండల అధికారులు, సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెన్షన్ అందుకున్న వృద్ధులు, మహిళలు ఎమ్మెల్యేకి కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.


## పలాస 1వ వార్డులో 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ

### -లబ్ధిదారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే గౌతు శిరీష!



**పలాస, జూన్ 1(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో "ఎన్టీఆర్ భరోసా" సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ డబ్బులను అందజేశారు. పింఛన్ల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారితో ఆప్యాయంగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిని, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సాయం పట్ల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా పింఛన్లు అందిస్తోందని స్పష్టం చేశారు. వృద్ధాప్య, వికలాంగ పింఛన్లను పెంచడం ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని, లబ్ధిదారుల ముంగిటకే లబ్ధి చేకూర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## పేదలకు అండగా కూటమి ప్రభుత్వం



**ఎల్ఎన్ పేట, జూన్1(వార్త):** పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. సోమవారం మండలంలోని ఆర్ఆర్ కాలనీ గార్లపాడు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్ల కార్యక్రమంలో ఆయన పాల్గొని పించన్లు పంఫిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చిందని. గత ప్రభుత్వం పించన్ ధారులకు ప్రతీ ఏడాది 250 పెంచుకుంటూ వారికి మోసం చేసిందన్నారు. ప్రస్థుతం కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పించనారులందరికీ ఒక్కసారిగా పెంచడం జరిగిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు,గ్యాస్ సిలిండర్ల పథకం, తల్లికివందనం, స్త్రీ శక్తి వంటి పథకాలు వంటివి అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ తెలుగుయువత నాయకులు అంపిలి పోలినాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ కె కృష్ణమాచార్య, మాజీ సర్పంచులు, నాయకులు వెలమల గోవిందరావు, చింతాడ శ్రీనివాసరావు, ఒమ్మి ఆనందరావు జమ్మి మోహన్ రావు, పొన్నాన రామకృష్ణ మాస్టారు, నడి పిల్లి నారాయణరావు, కుంచాల బాలకృష్ణ, జి.సోమేశ్వరరావు,పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రికి ఘన స్వాగతం పలికిన ధర్మారావు

**పలాస, జూన్ 1 (వార్త):** కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి ఘన స్వాగతం పలికి సత్కారం చేసిన జనసేన నాయకుడు నందిగామ ధర్మారావు. విశాఖపట్నం సౌత్ కోస్ట్ రైల్వే జోన్ బోర్డ్ ఆవిష్కరణలో ముఖ్యఅతిథులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకి సోమవారం పలాస రైల్వే స్టేషన్ లో అభినందించారు. కేక్ కటింగ్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిరీక్షణ చేస్తున్న కలకు కుటమి ప్రభుత్వ హయాములో సహకారం జరగడం కావడంతో పలాస పట్టణ జనసేన నాయకులు నందిగం ధర్మారావు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ ఇప్పటికే పోర్టు, పరిశ్రమలు, రవాణా కేంద్రంగా ఉంది. కొత్త జోన్ రావడం వల్ల ఈ నగరానికి ప్రాంతీయ హబ్ స్థానం మరింత బలపడుతుంది. రైల్వే పరిపాలన, సిబ్బంది, నిర్వహణ, ప్రయాణికుల సేవలు అన్నీ పెరగడం వల్ల నగరంలో రోజువారీ వ్యయం, సేవల వినియోగం, వాణిజ్య లావాదేవీలు కూడా పెరుగుతాయి. దీంతో విశాఖను "కేవలం పారిశ్రామిక నగరం" కాకుండా మరింత బలమైన లాజిస్టిక్స్-సేవల కేంద్రంగా చూడవచ్చునని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శంకు శ్రీకాంత్, తుంగనా దేవా, బంగారి కేదార్నాథ్, దువ్వాడ వంశీ చౌదరి, తెలుగుదేశం పార్టీ క్యాడర్ తదితరులు పాల్గొన్నారు.




# సాగునీటి వ్యవస్థను మెరుగుపరుస్తాం

### - ఖరీఫ్ నాటికి కాలువల మరమ్మతులు పూర్తి చేయాలి

### - వంశధార అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశాలు



**నరసన్నపేట, జూన్ 1(వార్త):** రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు ఎటువంటి సాగునీటి ఇబ్బందులు కలగకుండా కాలువలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం నరసన్నపేట ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన వంశధార ప్రాజెక్టు సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వంశధార ప్రాజెక్టు పరిధిలోని చివరి ఆయకట్టు భూములకు కూడా నిరంతరాయంగా సాగునీరు అందేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా టెయిల్ ఎండ్ ప్రాంతాల రైతులకు నీటి కొరత తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రధాన కాలువలు, పంపిణీ కాలువల్లో పూడికతీత పనులు, లైనింగ్ పనులు, లాకుల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి వృథాను అరికట్టడంలో, రైతులకు సమానంగా నీటి పంపిణీ నిర్వహణలో నీటి సంఘాల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు, కమిటీ చైర్మన్లు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని అన్నారు. సమావేశంలో స్థానిక నీటి సంఘాల ప్రతినిధులు తమ పరిధిలోని కాలువల దుస్థితి, నీటి ఎద్దడి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన నిధుల మంజూరు, మరమ్మతు పనులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నరసన్నపేట నియోజకవర్గ రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం నిరంతరం అండగా ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్లు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు సత్యనారాయణ, మిరియాలపల్లి వెంకటప్పలనాయుడు, కోరడ నాగరాజు, నీటి సంఘాల అధ్యక్షులు, వంశధార ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.



## ఉద్ధరిస్తాడనుకున్న కుమారుడు అందని లోకాలకు

### - తల్లిదండ్రుల ఆశలు అడియాశలు

### -హైదరాబాదులో మందస విద్యార్థి మృతి



**మందస, జూన్ 1(వార్త):** ఉద్ధరిస్తాడనుకున్న కుమారుడు అందని లోకాలకు వెళ్లిపోయాడు.. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు.. విద్యార్థి దశలోనే మరణించి, విషాదం ఆ గ్రామంలో విషాదం నింపాడు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని కొంకడాపుట్టి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మంగుకోపాత్రో కుమారుడు అంకిత్ హైదరాబాదులో చదువుకుంటున్నాడు. ఎం.టెక్ చదువుతున్న అంకిత్ ఉన్నత చదువులు చదవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, స్నేహితులతో స్నానానికి అంకిత్ వెళ్లాడు. ఏమయ్యిందో.. ఏమో.. కానీ అంకిత్ నీటిలో మునిగి మరణించాడు. ఆయన మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంకిత్ మరణించిన సమాచారం తల్లిదండ్రులకు చేరడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇదిలా ఉండగా.. అంకిత్ మృతదేహం అంబులెన్స్లో కొంకడాపుట్టి గ్రామానికి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కుమారుడు మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న మంగుకో పాత్రోకు పలువురు సానుభూతి తెలిపారు.

## మార్పు బాటలో ఏఎస్ పేట ప్రాథమిక పాఠశాల

### - దాతల చేయూతతో మెరుగైన వసతులు



**ఇచ్ఛాపురం, జూన్ 1(వార్త):** సమష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చవచ్చని నిరూపించారు ఎ .ఎస్.పేట గ్రామ దాతలు మరియు యువత. స్థానిక ఎ.ఎస్.పేట పురపాలక ప్రాథమిక పాఠశాల లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు పలువురు దాతలు పెద్ద మనసుతో ముందుకొచ్చారు. గత కొంతకాలంగా పాఠశాలలో మౌలిక వసతుల కొరత ఉండటాన్ని గమనించిన వారందరు ఒకే తాటిపైకి వచ్చి స్కూల్‌ను బాగు చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా పాడుబడి,నీటి మునిగిపోయే స్కూల్ ప్రాంగణాన్ని మట్టి వేయించి,శుభ్రం చేయించి,తరగతి నిర్వహణ ప్రాంగణం చుట్టూ కంచె వేయించారు.తద్వారా పిల్లలు ఆహ్లాదకరమైన,భద్రతాపరమైన వాతావరణంలో చదువుకునేలా తీర్చిదిద్దారు.మన ఊరి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలను బాగు చేసుకోవడం మన అందరి బాధ్యత. అందుకే మా వంతు చిన్న సహాయం చేశాము. రాబోయే రోజుల్లో స్కూల్‌ను మరిన్ని వసతులతో డిజిటల్ బాటలో నడిపించడానికి కృషి చేస్తాం" అని దాతలు ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల రూపురేఖలు మారి, వసతులు మెరుగుపడటం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిరిపురపు సునీల్ కుమార్,షేక్ ఆఫ్రిద్ ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్ అభివృద్ధికి విరాళాలు అందించి, పనులను దగ్గరుండి పూర్తి చేయించిన సాలీన వినయ్ కి మరియు సహకరించిన దాతలు, గ్రామ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం మండల విద్యాశాఖ అధికారి 2 విశ్వనాథ్ పాల్గొన్నారు, ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు.

## గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తికి కీడలు దోహదం

### - ఘనంగా ముగిసిన బీపీఎల్-8 క్రికెట్ టోర్నమెంట్

### - తామాడ శ్యామ్ జట్టు విజేత

**పలాస, జూన్ 1(వార్త):** గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని బొడ్డపాడు టిడిపి నాయకుడు, మాజీ అధ్యక్షుడు కిక్కిర ఢిల్లీరావు అన్నారు. బొడ్డపాడు గ్రామంలో నిర్వహించిన బొడ్డపాడు ప్రీమియర్ లీగ్ ( బిపిఎల్ -8) క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో తామాడ శ్యామ్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు బొడ్డపాడు గ్రామ సామాజిక కార్యకర్త కిక్కర ఢిల్లీరావు (కెడిఅర్) రూ.10,000 నగదు బహుమతిని, అందజేసి అభినందించారు. తంగుడు చంద్రశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించడంలో బీపీఎల్ కమిటీ సభ్యులు మద్దిల తార, ఎరుమాకు ఆకాశ్, పోతనపల్లి మురళి, పోతనపల్లి గోపి, బొడ్డు వినోద్, పోతనపల్లి వినీల్, పోతనపల్లి విలాస్ కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ తామాడ మదన్, సీనియర్ టీడీపీ నాయకులు సార జోగారావు, జెడ్పీహెచ్ఎస్ చైర్మన్ గర్తం తులసిరావు, డీఎస్సీ అధ్యక్షుడు బైనపల్లి కేశవరావు, అండమాన్లో నివసిస్తున్న ప్రవాస బొడ్డపాడు వాస్తవ్యులు పోతనపల్లి కూర్మారావు, దుష్యంత్, తామాడ జోగారావు, సీనియర్ క్రీడాకారులు తెప్పల చిట్టిబాబు, తామాడ శ్యామ్, బాలు బిల్డర్స్ ఎండీ బుడత బాలరాజు, బుడత వాసుదేవ్, నిరంజన్ పాణిగ్రహీ, బొడ్డు యుగంధర్, హిందీ మాష్టర్ బొడ్డు చిన్నారావు, సుబుద్ధి అఖిల్, ఇప్పిలి రాజేష్, మద్దిల కిరణ్, తామాడ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## పేదల సేవలో టీడీపీ నేతలు

### - పలాసలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేసిన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ



**పలాస, జూన్ 1(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఎన్టీఆర్ భరోసా పథకం ప్రధాన లక్ష్యమని ఏపీటీపీసీ చైర్మన్ ఢ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా పలాస పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వజ్జ బాబూరావు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భద్రత కల్పిస్తోందన్నారు. పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందనే నమ్మకాన్ని కలిగించే సామాజిక భరోసా అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో పలాస నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం తమ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందించడం వల్ల ఇబ్బందులు తగ్గాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పిరుకట్ల విఠల్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీను, కొరికాన శంకర్, సప్ప నవీన్, కృష్ణ నాయక్, పిట్ట రవి, దాసరి చిన్న, బేపల సంతోష్, తాడి చిరు, దడియాలు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## టెట్ మినహాయింపు కోసం చొరవ తీసుకోవాలి

### - ఎస్.జి.టి.ఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు మిశ్రో



**ఎల్ఎన్ పేట, జూన్ 1(వార్త):** ఇటీవల సుప్రీంకోర్టు అందరూ ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా వ్రాయాలని తీర్పు ఇచ్చిన విషయం విదితమే. ఇది ప్రభుత్వంలోని ఏ ఇతర శాఖల్లో లేని విధంగా టెట్ అమలుకాక ముందు సర్వీస్ చేసిన ఉపాధ్యాయులకు కూడా రాయమనడం ఆందోళనకు గురిచేస్తుందని రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు, ఎస్.జి.టి.ఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎం.కె. మిశ్రో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటి సాంకేతిక, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు తెచ్చేందుకు కృషి చేయగలరని కోరారు. కార్యక్రమంలో ఎస్ జి టి ఎఫ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546